క్లుప్తంగా

ఎస్సై రాముకు అభినందనలు

సఖినేటిపల్లి: స్థానిక పోలీసు స్టేషన్ ఎస్సై ఎస్.రాముకు, విద్యార్థి సంఘ నాయకులు అభినందనలు తెలిపారు. ఆదివారం ఈ మేరకు స్టేషన్‌లో ఎస్సై రామును శాలువాతో విద్యార్థి సంఘ నాయకుడు పోలిశెట్టి గణేష్ సత్కరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అంకిత భావంతో విధులు నిర్వహించి, ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి, భద్రతలను పర్యవేక్షించారని గణేష్ అన్నారు. చొప్పల రామకృష్ణ, కె.సురేష్, పోలిశెట్టి గంగ, యెనుముల సతీష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బాధ్యత కీలకం



లక్కవరంలో ఉపాధ్యాయుడు ప్రభాకర్ దంపతులను సన్మానించిన ఎంపీపీ సత్యవాణి

మలికిపురం: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి పేర్కొన్నారు. లక్కవరం పాఠశాల ఉపాధ్యాయులు, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎస్ఎస్ఎన్ఇ ప్రభాకర్ ఉద్యోగ విరమణ నేపథ్యంలో లక్కవరంలో ఆదివారం జరిగిన సన్మానంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ విరమణతోనే వారి సేవలు ముగియలేదని సమాజానికి ఇంకా అనేక సేవలు అందించాలని సూచించారు. ఉద్యోగులకు విరమణ అనేది సాధారణమే అయినా వారి వయస్సుకు, బాధ్యతలకు విరమణ ఉండదని అన్నారు. మాజీ జెడ్పీటీసీ మంగెన భూదేవి, సర్పంచ్ కోట పుష్పకుమారి, ఎంఈఈఓలు ఎం.విజయశ్రీ, వైసత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతల రోడ్డును అభివృద్ధి చేయరా?



గుంతలతో అధ్వానంగా మారిన ముక్తేశ్వరం-ముమ్మిడివరం ఆర్అండ్‌బీ రోడ్డు

అయినవిల్లి: ఈ రోడ్డు గుంతలు ఈ నాటికి కావు. మూడు ప్రభుత్వాలు మారాయి కానీ ఈ రోడ్డు గుంతలు పూడ్చిన నాథుడే కరువయ్యాడు. అప్పటి నుంచి అభివృద్ధికి ఈ రోడ్డు నోచుకోలేదు. ఇంతకీ ఈ రోడ్డు ఎక్కడా అంటారా. అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం నుంచి తొత్తరమూడి, కె.జగన్నాథపురం, పోతుకుర్రు, క్రాప మీదుగా ముమ్మిడివరం మండలం వరకూ సుమారుగా 10 కిలోమీటర్లు ఈ రోడ్డు విస్తరించి ఉంది. ఈ రోడ్డు ముమ్మిడివరం నుంచి కె.జగన్నాథపురం వరకూ 2010లో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పరచింది. కాస్తో కూస్తో ఈ రోడ్డు బాగానే ఉంది. అప్పుడప్పుడు అధికారులు మెయింటెనెన్స్ చేస్తున్నారు. కె.జగన్నాథపురం నుంచి ముక్తేశ్వరం వరకూ మాత్రం అడుగడుగుకో గుంత కన్పిస్తుంది. ఈ రోడ్డులో ఒక్క బాలింతలకే కాదు ఏవరికైనా డెలివరి అవ్వాల్సిందే. ఇదేమిటి అంటారా. ఈ రోడ్డులో ప్రయాణిస్తే ఎముకలు ఎక్కడ ఉన్నాయో ఒక్కసారి సరి చూసుకోవాల్సిందే. ఇది రోడ్డు దుస్థితి. ఈ రోడ్డులో రోజుకో రెండు నుంచి మూడు ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. ఈ రోడ్డులో ఆర్టీసీ బస్సులో ప్రయాణమంటే నరకమే. మరి రోడ్డును అభివృద్ధి చేయలేదని గత పాలకులపై రాళ్లు రప్పలు వేసే కన్నా. మీరే ఈ రోడ్డును అభివృద్ధి చేసి ఈ క్రెడిట్ మీ అకౌంట్‌లో వేసుకోవచ్చు కదా అని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు.

సురక్షిత నీటి సరఫరా లక్ష్యంగా..

- తాగునీరు కలుషితం కాకుండా చర్యలు
- గ్రామాల్లో మంచినీటి ట్యాంకుల క్లీనింగ్
- కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో 421 రక్షిత మంచినీటి పథకాలు



బిళ్లకుర్రులో వాటర్ ట్యాంకు క్లీనింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది



బిళ్లకుర్రులో వాటర్ ట్యాంక్ పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కొత్తపేట: గ్రామాల్లో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నైరుతి రుతుపవనాల రాక, వర్షాకాలం ప్రారంభంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులు, పరిసరాలు శుభ్రం చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలకు, వాటి నుంచి పైపులైన్లకు తాగునీటి సరఫరా చేసే మంచినీటి పైపులు లీకై నీరు కలుషితం అవుతోంది. అలా లీకయ్యే పైపులను సకాలంలో గుర్తించకపోవడం, వాటి నుంచి సరఫరా అయ్యే నీటిని తాగడం వల్ల ప్రజలు వాంతులు, విరేచనాలతో రోగాల బారిన పడుతున్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కొత్తపేట నియోజకవర్గంలో 122, పి.గన్నవరం నియోజకవర్గంలో 150, రాజోలు నియోజకవర్గంలో 149 రక్షిత మంచినీటి పథకాలున్నాయి. వాటిని ఈ నెల 12 నుంచి శుభ్రపరిచేందుకు మండలాల పరిధిలో ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఈఓపీఆర్డీల పర్యవేక్షణలో పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచే చర్యలు

- గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి విధిగా శుభ్రం చేయాలి. శుభ్రం చేసిన తేదీని, మరలా శుభ్రం చేయబోయే తేదీని అక్కడ బోర్డుపై పేర్కొనాలి.
- ప్రతీ 20 లీటర్ల నీటికి 0.50 ఎంజీ క్లోరిన్ టాబ్లెట్స్ కలపాలి. తాగునీటిని సరఫరా చేసే పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలి.
- రక్షిత మంచినీటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా, తద్వారా నీరు కలుషితం కాకుండా పరిశుభ్రంగా ఉంచాలి.
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమ పరిధిలోని రక్షిత మంచినీటి పథకాలను తరచూ తనిఖీ చేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలి.
- గ్రామాల్లో తాగునీటికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.
- గ్రామ పంచాయతీల్లో బ్లీచింగ్, లిక్విడ్, క్లోరిన్ స్టాక్ ఉంచుకోవాలి.

ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని ప్రభుత్వాలు, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఉత్తర్వులు, ఆదేశాలు జారీ చేస్తున్నా అనేక గ్రామాల్లో కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పరిశుభ్రమైన నీటిని అందించేందుకు చర్యలు

గ్రామాల్లో సురక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నాం. తాగునీరు ఎక్కడా కలుషితం కాకుండా జల్‌జీవన్ మిషన్ పథకం కింద పైపులైన్లు ఏర్పాటు చేశాం. ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ట్యాంకులు క్లీనింగ్, ట్యాంకుల పరిసరాలు పరిశుభ్రతకు చర్యలు తీసుకున్నాం. తాగునీటిని క్లోరినేషన్ చేయిస్తున్నాం. ఆయా ట్యాంకులు, పైపులైన్ల ద్వారా ప్రజలకు సురక్షిత నీరు సరఫరా చేస్తున్నాం.

పి.పద్మ, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కొత్తపేట

శ్యామా త్యాగం వృథా పోలేదు



కేశనపల్లిలో ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



మామిడికుదురులో శ్యామా ప్రసాద్ చిత్రపటానికి ముఖర్జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

మామిడికుదురు: జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్‌ను ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మామిడికుదురు బస్టాండ్ కూడలిలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణతో పాటు పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒకే దేశం, ఒకే జాతీయ జెండా, ఒకే చట్టం, ఒకే ప్రధాని ఉండాలని చాటి చెప్పిన మహనీయుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కీర్తించారు. అతని త్యాగం వృథా పోకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 370 ఆర్టికల్‌ను రద్దు చేసి ముఖర్జీకి ఘనమైన నివాళి అర్పించారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కంకిపాటి సుబ్బారావు, నక్కా త్రిలోచనరావు, పసుపులేటి మహలక్ష్మిరావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, బండారు పల్లంరాజు పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలోని కేశనపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు కాపిశెట్టి కనకేశ్వరరావు ఆధ్వర్యంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ (వర్ధంతి) కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు అనిశెట్టి బాలాజీ, గెద్దాడ నవీన్, జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు అడబాల వెంకన్న బాబు, కిసాన్ మోర్చా నాయకులు సుంకర రఘునాథ్ బాబు, అడబాలు ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉయ్యూరువారి మెరకలో పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు ఇంటి వద్ద పార్టీ మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు అధ్యక్షతన చేశారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటం వద్ద నాయకులు పూలమాల వేసి నివాళుర్పించారు.

రాజోలులో..

రాజోలు: శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్ వద్ద శ్యామా ప్రసాద్ వర్ధంతి, బలిదాన్ దివాస్ పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తపేటలో..

కొత్తపేట: శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని కొత్తపేటలో రాష్ట్ర బీజేపీ నేత పాలూరి సత్యానందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి సత్యానందం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కోనసీమ ప్రముఖ్ తొగరు సీతారామాంజనేయులు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ప్రసాదరాజు పాల్గొన్నారు.

అయినవిల్లిలో కిక్కిరిసిన భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామిని మేలుకొలుపు సేవ వివిధ పూజలు నిర్వహించారు. సంకటహర చతుర్థి పూజలు జరిపారు. అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకదశ రుద్రాభిషేకాల్లో 44 మంది, లక్ష్మీగణపతి హోమంలో 20 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. రెండు జంటలు పంచామృతాభిషేకాల్లో పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న శివ కుమార్ తదితరులు

మలికిపురం: గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి వారి సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పాటి శివకుమార్ అన్నారు. రాజోలు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన కాండ్రేగుల శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన చికిత్స నిమిత్తం సంస్థ సమకూర్చిన రూ.20 వేల నగదు గ్రామ పెద్దలందరూ అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాటి శివ కుమార్ పాల్గొని మాట్లాడుతూ సంస్థ సేవలను కొనియాడారు. గ్రామ పెద్దలు కాండ్రేగుల శ్రీహరి, కాండ్రేగుల సత్యనారాయణ, కాండ్రేగుల నారాయణరావు, గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న రహదారి



జి.అగ్రహారంలో చెరువును తలపిస్తున్న రహదారి

అంబాజీపేట: కొద్దిపాటి చినుకులకే గంగలకుర్రు అగ్రహారం శివాలయానికి వెళ్లే ప్రధాన రహదారి చెరువును తలపిస్తుంది. వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేక రోజుల తరబడి నిల్వ ఉండిపోతుంది దీంతో దుర్వాసనతో పాటు దోమలకు కేంద్రంగా నిలిచింది.

ఈ ప్రధాని రహదారిలో నీరు నిలవుండిపోవడంతో విద్యార్థులు, రైతులు, వృద్ధులు, శివాలయానికి వెళ్లే భక్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శివాలయానికి వెళ్లే ప్రధాన రహదారికి మోక్షం కలిగించి సీసీ రోడ్డు నిర్మించాలని భక్తులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రేపటి నుంచి శ్రవణం నక్షత్ర పూజలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఈ నెల 25 నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వేద పండితుల ఆధ్వర్యంలో 25న శ్రవణం నక్షత్రం సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం, శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారన్నారు. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో హాజరు కావాల్సిందిగా ఆలయ నిర్వాహకులు కోరారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు పలువురి విరాళాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయ సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఆదివారం పలువురు దాతలు విరాళాలు సమర్పించారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శింగంశెట్టి పుల్లేశ్వరస్వామి, గంగాభవాని దంపతులు రూ.11,131 విరాళంగా అందించారు. విజయవాడకు చెందిన బుర్ల రమేష్, శాంతికుమారి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారని ఆలయ ఈవో గ్రంధి మాధవి తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు స్వామి వారి వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



తొండవరంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

అంబాజీపేట: తొండవరం జెడ్పీ హైస్కూల్ కాలనీలో విద్యుత్ స్తంభం శిథిలస్థితికి చేరి విరిగిపోయి ప్రమాద భరితంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో విద్యుత్ స్తంభం బీటలు వారి కూలేందుకు సిద్ధంగా ఉంది. పక్కనే ఉన్న చెట్టుపై ఆధారపడి పడిపోకుండా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు విద్యుత్ స్తంభం కూలిపోతుందో.. ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉందని స్థానికుడు పి.రాజు అనేక సార్లు కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలస్థితికి చేరిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభం వేయాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా చింతాలమ్మ జాతర

మామిడికుదురు: పాశర్లపూడిలంక గ్రామ దేవత చింతాలమ్మ జాతర శనివారం రాత్రి వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జాతర మహోత్సవాలు నాలుగు రోజుల పాటు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

ముగిసిన రామ ఏకాహం

అలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసిన కోదండ రామాలయం ఆలయ 36 వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీరామ ఏకాహం ఆదివారం ముగిసింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈఏకాహంలో గ్రామానికి చెందిన మోటుపల్లి సత్తిబాబు, అమృత దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శనివారం రాత్రి ఏకాహం సందర్భంగా నిర్వహించిన పవళింపు సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భజన బృందాలు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి.

ఘనంగా కనక మహాలక్ష్మి అమ్మవారి తీర్థం

పి.గన్నవరం: ఊడిమూడి శివారు ఆదిమూలంవారి పాలెంలో వేంచేసిన కనక మహాలక్ష్మి అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు.

వాసవీ క్లబ్ ద్వారా సమాజ సేవా కార్యక్రమాలు

- వాసవీ క్లబ్ గవర్నర్ ప్రవీణ్‌కుమార్
- వాడపాలెంలో గాంధీ విగ్రహావిష్కరణ



వాడపాలెంలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రవీణ్‌కుమార్

కొత్తపేట: వాసవీ క్లబ్ ద్వారా పేదలు, అంధులు, దివ్యాంగులు, పేద విద్యార్థులతో పాటు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాళ్లకూరి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు కొత్తపేట క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వీసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ మండపంలో డాన్ టు డస్క్ (ఉదయాస్తమాన సేవా కార్యక్రమాలు) నిర్వహించారు. సభకు స్థానిక వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్ఎన్‌యూకే లింగేశ్వరరావు అధ్యక్షత వహించగా వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాళ్లకూరి ప్రవీణ్‌కుమార్, క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నారాయణ సురేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వాసవీ క్లబ్ లక్ష్యాలు, సేవా కార్యక్రమాలు గురించి వివరించారు. స్థానిక వాసవీ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు. సేవాదృక్పదం గల ఆర్యవైశ్యులు మరింత మంది క్లబ్‌లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం 5 గురు అంధులకు బ్లెండ్ స్టిక్స్, 20 మంది విద్యార్థులకు స్టేషనరీ కిట్స్, ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌కు మాస్కులు, టవల్స్, గొడుగులు, వాసవీమాత ఆలయానికి స్టూల్స్ పంపిణీ చేశారు. పలువురిచే నేత్ర, అవయవ దాన పత్రాలు పూర్తి చేయించారు. కొత్తగా 10 మందిని క్లబ్ సభ్యులుగా చేరగా వారిచే క్లబ్ నియమ నిబంధనలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మండలంలోని వాడపాలెం ఆర్యవైశ్య సంఘ భవనంలో నెలకొల్పేందుకు ఆలిండియా ఆర్యవైశ్య సంఘం మాజీ ప్రెసిడెంట్ కాళ్లకూరి నాగబాబు సమర్పించిన గాంధీ విగ్రహాన్ని డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో క్లబ్ డిస్ట్రిక్ట్ సభ్యులు రాజా నాగరత్నకుమార్, డాక్టర్ పచ్చిపులుసు కృష్ణారావు, కొత్తపేట క్లబ్ సెక్రటరీ కొత్త ఎస్ఎస్ బంగారురామారావు, కొత్త జగన్నాథరావు, వాడపాలెం ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ శ్రీఘాకోళ్లపు భీమేశ్వరరావు, సెక్రటరీ పచ్చిపులుసు తాతారావు, ట్రెజరర్ శ్రీఘాకోళ్లపు వీరబాబు, సత్యవరపు సమీందార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఒలింపిక్ డే రన్



మామిడికుదురులో జరిగిన ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న ఉద్యోగులు



అంబాజీపేటలో ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, పీడీలు, విద్యార్థులు

పి.గన్నవరం: పి.గన్నవరంలో ఆదివారం ఒలింపిక్ డే రన్ కార్యక్రమం జరిగింది. మండలంలోని పీడీఓలు, పీఈటీలు, క్రీడాకారులు, విద్యార్థులు ఆదివారం ఈ రన్‌లో పాల్గొన్నారు. మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కేవీ రమణ మాట్లాడుతూ ఏటా ఒలింపిక్ రన్ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో వై.నాగసతీష్, జీవీ సుబ్బారాయుడు, ఎస్‌కే కమల్, ఎం.దుర్గాప్రసాద్, ప్రభాకర్, జి.శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు. రన్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: ఒలింపిక్ డే సందర్భంగా ఆదివారం మామిడికుదురులో ఒలింపిక్ రన్ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ఈ రన్ జరిగింది.

విద్యార్థులు వ్యాయామ ఉపాధ్యాయులు ఈ రన్‌లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రన్‌లో పాల్గొన్న విద్యార్థులకు ఎంఈఓలు ఎం.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు సర్టిఫికెట్లు అందించారు. మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ మట్టా శ్రీధర్, అప్పన రామకృష్ణ, పీడీలు బళ్ల శ్రీనివాస్, మట్టా శ్రీనివాసరావు, పీఈటీ పి.జయప్రకాష్‌తో పాటు 70 మంది విద్యార్థులు ఒలింపిక్ రన్‌లో పాల్గొన్నారు.

క్రీడలు ఖండాంతర బంధాలు పెంచుతాయి

అంబాజీపేట: క్రీడలు ఖండంతర స్నేహబంధాలు పెంచడమే కాకుండా ఆటల పోటీల్లో చురుగ్గా రాణిస్తారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. ఒలింపిక్ డే రన్ కార్యక్రమాన్ని అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో పీడీ కె.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ఒలింపిక్ రన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వారు రన్‌ను ప్రారంభించి ప్రసంగించారు. ఆటలు ఆడే విధంగా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. క్రీడలు వల్ల మానసికోల్లాసంతో పాటు మేధాశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ఏపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వ్యాయామ ఉపాధ్యాయులతో క్రీడాకారులు ప్రతిజ్ఞ చేశారు. క్రీడలపై ఆసక్తి గౌరవంతో నిబంధనలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా ఉంటానని ప్రతిజ్ఞ చేశారు. ఈ రన్‌లో పీడీలు అందె సూర్యనారాయణ, పి.సూర్యనారాయణ, ఎ.శ్రీనివాస్, తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు, పీఈటీ అందె సూర్యకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం కన్వీనర్లు ఎంఎస్‌డీఓ వైఎస్ఎస్ ఉషారాణి, పీడీలు ఏఎస్ఎస్ రమాదేవి, ముత్యాల కిషోర్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం ఎన్.సత్యనారాయణ, రిటైర్డ్ పీఈటీలు యర్రంశెట్టి చినరామన్న, మారిశెట్టి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మానసికోల్లాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఒలింపిక్ డే రన్‌లో సుమారు 70 మంది క్రీడాకారులు పాల్గొనగా వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పీడీలు సలాది వెంకటరమణ, కె.రఘుప్రియ, వై.శ్రీనివాసరావు, కె.లావణ్య, కె.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలో ఒలింపిక్ డే రన్‌ను ఆదివారం పీఈటీలు నిర్వహించారు. పీఈటీలు ఎన్.శుభాకర్, కె.కృష్ణప్రసాద్, సుజాత, పెద్దిరాజు, సతీష్ కుమార్, పలువురు పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఆదివారం ఒలింపిక్ రన్ నిర్వహించారు. ఒలింపిక్ రన్ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ క్రీడా జ్యోతిని ప్రజ్వలించి ఒలింపిక్ రన్ ప్రారంభించారు. క్రీడల ద్వారా ప్రపంచంలోని అన్ని దేశాల మధ్య స్నేహబంధం అభివృద్ధి చెందుతుందన్నారు. పలువురు విద్యార్థులకు ఒలింపిక్ రన్ సర్టిఫికెట్స్ అందజేశారు. నాయకులు పితాని శ్రీను, రాధాకృష్ణ, గొల్లమందల నిరంజన్‌రావు, పొన్నాడ భాను, వడ్లమూడి ప్రకాష్, బొంతు మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.